క్లుప్తంగా

పాఠశాలను సందర్శించిన డైట్ అధ్యాపక బృందం


విద్యార్థులతో డైట్ అధ్యాపకులు, పాఠశాల ఉపాధ్యాయులు

డెంకాడ: మండలంలోని అమకాం పంచాయతీ, చిట్టిగుంకలాం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను డైట్(జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థ) అధ్యాపక బృందం గురువారం సందర్శించింది. ప్రతి తరగతికి వెళ్లి ఉపాధ్యాయుల విద్యాబోధన, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించి, పలు సూచనలు చేశారు. విద్యార్థుల అర్థమయ్యే రీతిలో లెస్సన్ ప్లాన్ ఆధారంగా పాఠ్యాంశాల బోధన చేపట్టాలని అధ్యాపకులను కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు వి.చిన్నంనాయుడు, ఐ.ఎస్.కె. శర్మ, కె.అన్నారావు, ఎ.శశిభూషణరావు, కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే తొలి టెలీ సర్జరీ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ తిరుమలప్రసాద్

విజయనగరం ఫోర్ట్: రాష్ట్రంలోని తొలి టెలీ సర్జరీ తిరుమల మెడికవర్ ఆస్పత్రిలో నిర్వహించినట్లు ఆస్పత్రి వైద్యుడు కె.తిరుమలప్రసాద్ తెలిపారు. ఇదే విషయమై ఆయన స్థానిక ఎస్వీఎన్ లేక్ ప్యాలెస్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. గుర్గావ్(ఢిల్లీ)లోని ఎస్ఎస్ఐ ప్రధాన కార్యాలయం నుంచి విజయనగరంలోని తిరుమల మెడికవర్ హాస్పిటల్‌లో ఈ శస్త్ర చికిత్స చేయడం జరిగిందన్నారు. టెలీ సర్జరీ టైర్–3 నగరంలో జరిగిన తొలి శస్త్రచికిత్సగా గుర్తింపు పొందడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 50 రోబొటిక్ సర్జరీలను విజయవంతంగా పూర్తి చేశామన్నారు.

ఏఐ ల్యాబ్ ప్రారంభం


ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న సీతం కళాశాల కరస్పాండెంట్ రుూన్సీలక్ష్మి

విజయనగరం అర్బన్: సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐఎంఎల్(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్) ల్యాబ్‌ను కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ బొత్స రుూన్సీ లక్ష్మి గురువారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఏఐఎంఎల్ సాంకేతికత.. పునరావృత పనులను ఆటోమేటిగ్గా చేయడం, నిర్ణయాలు తీసుకోవడం వంటి ప్రయోజనాలు అందిస్తాయని, వాటిని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపాల్ వి.రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన సదస్సు

విజయనగరంఫోర్ట్: స్థానిక లక్ష్మి స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాలలో హెచ్ఐవీ(హ్యూమన్ ఇమ్యునోవైరస్)పై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ కె.గౌరి..హెచ్ఐవీ ఏ విధంగా వ్యాపిస్తుంది..వైరస్ బారినపడిన వారు ఎయిడ్స్ వ్యాధికి ఎలా గురవుతారన్న విషయాలను వివరించారు. సురక్షితం కాని లైంగిక సంబంధాలు, పాలు, రక్తమార్పిడి వల్ల వైరస్ సోకుతుందని, వైరస్ సోకిన ఐదు నుంచి పదేళ్లకు ఎయిడ్స్ వ్యాధి బయటపడుతుందన్నారు. వైరస్ ప్రాణాంతకమైనదని, ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాగే హెచ్ఐవీ రోగుల పట్ల వివక్ష చూపొద్దన్నారు. హెచ్ఐవీ సోకిన వారికి 2017 ఎయిడ్స్ చట్టం ప్రకారం సమాన హక్కులు, విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించబడ్డాయని, వీటిని ఉల్లంఘించిన వారు శిక్షార్హులన్నారు.

పక్కాగా స్వమిత్వ సర్వే చేపట్టాలి


గ్రామకంఠం భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో శిరీషారాణి

నెల్లిమర్ల రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో స్వమిత్వ సర్వే పక్కాగా నిర్వహించాలని డివిజనల్ పంచాయతీ అధికారి శిరీషారాణి ఆదేశించారు. మండలంలోని సీతారామునిపేటలో జరుగుతున్న సర్వేను ఆమె గురువారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి పత్రాలు లేకుండా ఉన్న నివాసాలను సర్వే చేసి ఇంటి హక్కులకు కల్పించాలన్నారు. ఇంటి హక్కులు పొందడం వల్ల బ్యాంకుల నుంచి రుణం పొందే అవకాశం ఉంటుందన్నారు. ప్రజలకు ప్రయోజనం చేకూర్చే సర్వేల పట్ల సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని, సర్వేలో అలసత్వం వహించినన వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నిర్ణీత గడువులోగా పారదర్శకంగా సర్వేను పూర్తి చేయాలన్నారు. అనంతరం గ్రామకంఠం భూములకు సంబంధించి, పంచాయతీ మ్యాప్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శంకర జగన్నాథం, కార్యదర్శి బంగార్రాజు పాల్గొన్నారు.

జై బోలో గణేశ్ మహరాజ్ కీ..


తోటపాలెం సాయినగర్‌లో కాఫీ గింజలతో రూపొందించిన వినాయకుడు


తోటపాలెం సాయినగర్ రోడ్డులో వేసిన గణేశుని మండపం భారీ సెట్


గోషాస్పత్రి రోడ్డులో గణేశుని మండపం సెట్


గాజులరేగలో వేసిన విఘ్నేశ్వరుని మండపం


విజయనగరం: విద్యుత్ అలంకరణలో జిల్లా కేంద్రంలోని న్యూ సెంట్రల్ స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గణనాథుని సెట్


పెద్ద చెరువు రోడ్డులోని మండపంలో కొలువుదీరిన లంబోదరుడు



ఆకట్టుకున్న తోటపాలెంలోని వినాయకుడి మండపం

వాడవాడలా వినాయక చవితి సందడి నెలకొంది. బుధవారం నుంచి ఆరంభమైన ఈ ఉత్సవాల్లో భక్తులంతా పాల్గొని, మండపాల్లో కొలువుదీరిన గణనాథుడికి విశేష పూజలు చేశారు. తాము తలపెట్టే ఏ కార్యంలోనూ విఘ్నం తలెత్తకుండా చూడాలని విఘ్నేశ్వరుడిని వేడుకున్నారు. కొనసాగుతున్న ఈ వేడుకల్లో భక్తులు చేసే జై బోలో గణేశ్ మహరాజ్ కీ..గణపతి బప్పా మోరియా..నినాదాలతో పూజా ప్రాంగణాలు హోరెత్తుతున్నాయి. పలుచోట్ల ప్రత్యేకంగా రూపుదిద్దుకున్న మండపాలు, వివిధ ఆకారాల్లోని లంబోదరుని విగ్రహాలు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.
–విజయనగరం, నెల్లిమర్ల నెట్‌వర్క్



విజయనగరం: కంటోన్మెంట్ అంబేద్కర్ కాలనీలో పూజలందుకుంటున్న గణనాథుడు


నెల్లిమర్ల రూరల్: ఒమ్మిలో మండపానికి గణేశుని విగ్రహాన్ని తరలిస్తున్న యువత


భోగాపురంలో గణనాథుని వద్ద పూజలు చేస్తున్న భక్తులు


భోగాపురం: ఆకట్టుకుంటున్న లింగాలవలస విఘ్నేశ్వరుని భారీ సెట్


బుచ్చన్నకోనేరు వద్ద ఆలయ రూపంలో వినాయక మండపం సెట్


బాలాజీ మార్కెట్‌లోని మండపంలో దర్శనమిస్తున్న గణపతి


పూసపాటిరేగ కాలనీలో కొలువైన వినాయకుడు


డెంకాడ: గొడిపాలెం యాతపేటలో వినాయక మండపం సెట్

ముంపు ప్రాంతాల్లో అధికారుల పర్యటన


మోదవలసలో నీటమునిగిన వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు ఎ.నాగభూషణం

డెంకాడ: మండలంలోని ముంపు ప్రాంతాల్లో జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు ఎ.నాగభూషణం, వ్యవసాయాధికారిణి టి.సంగీతలు గురువారం పర్యటించారు. బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు నీటమునిగిన వరి పంటను వారు పరిశీలించారు. అనంతరం పంట పాడవ్వకుండా చేపట్టాల్సిన చర్యలను రైతులకు తెలిపారు. వారు మాట్లాడుతూ మోదవలసలో 15.25 ఎకరాలు, సింగవరం గ్రామంలో 14.75 ఎకరాల వరి పంట నీటమునిగిందన్నారు. మండలంలో జరిగిన పంటనష్టంపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని వారు చెప్పారు. వారి వెంట ఏఈవో బి.రామకోటి, వీఏఏ నిఖిత తదితరులు ఉన్నారు.

ఎంపీ అడిగితే నియోజకవర్గాన్ని మార్చేస్తారా?


మాట్లాడుతున్న లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ

విజయనగరం గంటస్తంభం: ఎంపీ భరత్ అడిగితే విజయనగరం జిల్లాలోని శృంగవరపుకోట నియోజకవర్గాన్ని విశాఖపట్నానికి మార్చేస్తారా అని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ ప్రశ్నించారు. విజయనగరం జిల్లాకు చెందిన శృంగవరపుకోట..విశాఖపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్నంత మాత్రాన శృంగవరపుకోట నియోజకవర్గాన్ని విశాఖపట్నంలో చేర్చాలని ఎంపీ భరత్ ప్రభుత్వానికి లేఖ రాయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇదే విషయమై ఆయన జిల్లా కేంద్రంలోని ఆయన పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. రాజకీయ అవసరాల కోసం ప్రజాభిప్రాయం సేకరించకుండా ఇలా ఎంపీ లేఖ రాయడమేంటని నిలదీశారు. ప్రజలను అడగకుండా లేఖ రాయడం ఆపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఎంపీ చెప్పడం ఏమాత్రం సరికాదన్నారు. శృంగవరపుకోట నియోజకవర్గాన్ని విజయనగరం జిల్లాలోనే కొనసాగించాలని, దీనిపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు.

విద్యార్థులకు రక్షణ ఏదీ?


ప్రహరీ లేని మొయిద ప్రభుత్వ బీసీ హాస్టల్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మొయిద ప్రభుత్వ బీసీ బాలురు వసతిగృహానికి రక్షణ కరువైంది. ఇక్కడి వసతిగృహానికి ఆనుకుని చంపావతి నది ఉండడం..ఇదే హాస్టల్‌కు ఉన్న రక్షణ గోడ పూర్తిగా శిథిలమవ్వడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల క్రితమే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్ ఈ హాస్టల్‌ను సందర్శించి, ప్రహరీ నిర్మించాలని సిబ్బందిని ఆదేశించారు. అయినా నిర్మాణానికి ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ప్రహరీ నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

విజయనగరంఫోర్ట్: పట్టణంలోని పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ పి.త్రినాథరావు ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. విద్యుత్ మరమ్మతు పనుల నేపథ్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గొల్ల, కుమ్మర, లంక, కానుకుర్తి వీధులతో పాటు రాజీవ్‌నగర్, పీఎస్ఆర్ కాలనీలు, బాలాజీ జంక్షన్, జొన్నగుడ్డి ప్రాంతాలకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

డెంకాడ: విద్యుత్ నిర్వహణ పనుల కారణంగా స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పినతాడివాడ, గొడిపాలెం, వెదుళ్లవలస గ్రామాలకు శుక్రవారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఆ శాఖ ఏఈ పి.అప్పలస్వామినాయుడు తెలిపారు.

భోగాపురం: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా మండలంలోని ఎ.రావివలస, గూడెపువలస, దల్లిపేట, రెడ్డికంచేరు, బైరెడ్డిపాలెం, ముగడపేట, ఆర్అండ్ఆర్ కాలనీ, చాకివలస, ఎ.రావివలస జేహెచ్‌సీ, జీఎంఆర్ ఎయిర్‌పోర్టు ఏరియా, ఎల్అండ్‌టీ, సన్‌రే గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఈఈ జి.సురేష్‌బాబు తెలిపారు.

మద్యంసీసాలు స్వాధీనం

పూసపాటిరేగ: మండలంలోని పసపాం గ్రామంలో భోగాపురం ఎక్సైజ్ సీఐ రవికుమార్ సిబ్బందితో గురువారం జరిపిన ఆకస్మిక తనిఖీల్లో ఓ వ్యక్తి వద్ద అక్రమంగా ఉన్న 9 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

విజయనగరం క్రైమ్: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటికి బానిసలై జీవితాలు నాశనం చేసుకోవద్దని ఈగల్ టీమ్ అధికారి విజయ్‌కుమార్ సూచించారు. నగరంలోని తోటపాలెం ఎస్ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గంజాయి, ఖైనీ, గుట్కా, పాన్‌పరాగ్, మద్యం, సిగరెట్ వంటి వాటిని అలవాటు చేసుకోవద్దని తెలిపారు. ఎంతోమంది యువత ఫ్యాషన్ మాయలో పడి చెడు అలవాట్లు బారినపడి తమ బంగారు భవిష్యత్ చెడగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా యువత, విద్యార్థులంతా మంచి అలవాట్లతో ఆదర్శవంతమైన జీవనం సాగించాలని కోరారు.

తీరప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


పూసపాటిరేగ పీహెచ్‌సీ వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి అచ్యుతకుమారి

పూసపాటిరేగ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో భారీగా వర్షాలు కురుస్తున్నందున తీరప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి పి.అచ్యుతకుమారి సూచించారు. మండలంలోని తీర ప్రాంతాలైన కోనాడ, బొడ్డుగురయ్యపేట, తిప్పలవలస, మత్స్యవానిపాలెం గ్రామాల్లో గురువారం ఆమె పర్యటించి, ఆయా గ్రామాల్లోని వైద్య శిబిరాలను సందర్శించారు. అనంతరం తుపాను సహాయక చర్యలపై ఆరాతీశారు. ప్రజలకు వైద్యారోగ్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని, ఎవరైనా జ్వర లక్షణాలతో బాధపడితే వారికి వెంటనే వైద్యం అందేలా చూడాలన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై అవగాహన కల్పించాలన్నారు. తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేపట్టి, జనానికి పరిశుభ్రమైన తాగునీరు అందేలా చూడాలన్నారు. ప్రసవానికి దగ్గరగా ఉన్న గర్భిణులను దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించి, సాధారణ ప్రసవం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అక్కడి నుంచి పూసపాటిరేగ పీహెచ్‌సీకి వెళ్లి, వైద్య సిబ్బంది పనితీరు, మందుల నిల్వలు, కుక్క, పాముకాటుల వ్యాక్సిన్లు పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని తెలిపారు. ఆమె వెంట వైద్యాధికారి ప్రమీలాదేవి ఉన్నారు.

పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలి


మాట్లాడుతున్న వర్సిటీ రిజిస్ట్రార్ జితేంద్రమోహన్ మిశ్రా

విజయనగరం అర్బన్: పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని కేంద్రియ గిరిజన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జితేంద్రమోహన్ మిశ్రా కోరారు. జిల్లాలోని అదే యూనివర్సిటీలో టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో సుస్థిర పర్యాటకం–ఉపాధి అవకాశాలకు మూలం అనే అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల వర్క్‌షాపును గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పండగలు, జాతరలు, తిరునాళ్లు వంటి సామూహిక వేడుకలను పర్యావరణ హితంగా జరుపుకోవాలని సూచించారు. ఈ వర్క్‌షాపులో భాగంగా పట్టణంలోని సహజ పరిసరాలను విద్యార్థులు సందర్శించి, ప్రజలను కలిసి పర్యావరణకు వారు పాటుపడేలా చైతన్యం చేయాలన్నారు. అలాగే సంప్రదాయ కళలు, హస్తకళల రక్షణను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ దీపక్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

డెంకాడ: విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకుని, కొత్త ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలని లెండి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి ఆకాంక్షించారు. మండలంలోని జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో హ్యాకథాన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. లెండి కళాశాల ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెల్, అమరావతి క్వాంటమ్ వ్యాలీ–2005 సమన్వయంతో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని, విద్యార్థులను ఉద్దేశించి కాసేపు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నేర్చే ప్రతి అంశం క్షుణ్ణంగా నేర్చుకుని, భవిష్యత్‌లో అభివృద్ధి చెందేందుకు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.